నేడు రక్తదాన శిబిరం

కాప్రా: మన్నె సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం నేడు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కుషాయిగూడ ఇండస్ట్రియల్ క్యాంటిన్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో చిన్నారి ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందజేస్తున్న మిస్టర్ వరల్డ్ కిరణ్‌కుమార్, (ఇన్‌సెట్‌లో) సర్టిఫికెట్‌తో ఆశ్రిత



బోడుప్పల్: పవర్ లిఫ్టింగ్‌లో బోడుప్పల్‌కు చెందిన ఆశ్రిత రాణిస్తోంది. జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీల్లో ముఖ్యఅతిథిగా మిస్టర్ వరల్డ్ కిరణ్‌కుమార్ హాజరై షీల్డ్, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున నగర్‌లోని ఏకలవ్యనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర లెప్రసీటీమ్ సభ్యులు మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే ధ్యేయమని, కుష్టువ్యాధిపై మరింత అవగాహన కల్పించాలన్నారు. వెంకటేశ్వరచారి, సాకలరెడ్డి, సురేందర్, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, మంగాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. 30న సాయంత్రం అంకురార్పణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న త్రిదండి చిన్నజీయర్‌స్వామి భక్తులకు తీర్థగోష్టి, నూతన శిఖర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు సమాచారం. ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

'వేయి గొంతులు.. లక్ష డప్పులు' విజయవంతం చేయండి



మందకృష్ణమాదిగతో బొజ్జ యాదగిరి

మల్లాపూర్: ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించే 'వేయ్యి గొంతులు.. లక్షల డప్పుల' ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం మందకృష్ణ మాదిగను దళిత జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి కలిసి కార్యక్రమంపై చర్చించారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

24 నుంచి కీసరగుట్టలో మహాశివరాత్రి జాతర

కీసర: ప్రసిద్ధిగాంచిన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి జాతర ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిబ్రవరి 24న విఘ్నేశ్వర పూజ, 25న స్వామివారి కల్యాణం, 26న మహాశివరాత్రి రోజున ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 27న విమాన రథోత్సవం, 28న వసంతోత్సవం, పుష్పయాగం, మార్చి 1న పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్తులకు పిలుపునిచ్చారు.

పేదలకు అందుబాటులోకి వైద్యం

పేదలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం 'తెలంగాణ దయాగ్నోస్టిక్స్' పేరిట వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాలను గత రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది.



మల్లికార్జుననగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం

- సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు
- ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు
- ఇరుకుగా ఉన్న అద్దె భవనాలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రంలో గత ఆరేళ్లుగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. పేదలకు రక్తం, షుగర్, థైరాయిడ్ ప్రొఫైల్, సీబీసీ, ఈఎస్ఆర్, ఆర్‌బీఎస్, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ పరీక్షలతో పాటు డెంగీ, మలేరియా, బి–12, విటమిన్ – డి, లిక్విడ్ ప్రొఫైల్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రైవేటులో ఖర్చులు అధికం..

ప్రైవేటులో రూ.వేల ఖర్చుతో నిర్వహించే వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తుండటంతో కీసర, నాగారం, ఉప్పల్, రామంతాపూర్, ఈసీఐఎల్, నెరేడ్‌మెట్, వినాయక్‌నగర్, ఆనంద్‌బాగ్, మల్కాజిగిరి, గౌతంనగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, బలరామ్ నగ్, ఇందిరానెహ్రూనగర్, మల్లికార్జుననగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

2018లో ప్రారంభం..

గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఏకలవ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం 2007లో ప్రారంభమైంది. మొదట ఏకలవ్యనగర్‌లో అద్దెగదులతో ఉండే ఈ కేంద్రం 2017లో మల్లికార్జుననగర్‌కు మారింది. 2018లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించిన తెలంగాణ డయగ్నోస్టిక్ ఈ కేంద్రంలో అందుబాటులో ఉంచారు. అప్పటి నుంచి పేద, మధ్యతరగతి ప్రజలు వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకుంటున్నారు. రోజూ సుమారు 30 నుంచి 40 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధా తెలిపారు.

ఉచితంగా మందులు..

ప్రస్తుతం పట్టణ ఆరోగ్య కేంద్రంలో మొత్తం 12 మంది వైద్య బృందం, ఆశవర్కర్లు అందుబాటులో ఉన్నారని ఆమె తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నవారికి రిపోర్టు ఆధారంగా మందులను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

పేదలకు వరంగా నిర్ధారణ పరీక్షలు..

'తెలంగాణ దయాగ్నోస్టిక్స్' పేరుతో ఏర్పాటు చేసిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారింది. రోగులకు అవసరమయ్యే అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తూ.. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రైవేటు వైద్యం కంటే ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తుండటం హర్షణీయం.

అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..



మల్లికార్జుననగర్‌లోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నాం. గర్భిణులు, వయోవృద్ధులు, చిన్నారులకు సైతం వైద్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రాధా, మెడికల్ ఆఫీసర్

సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలి



గత కొన్నేళ్లుగా పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పట్టణ ఆరోగ్య కేంద్రం కోసం విశాలమైన సొంత భవనం ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాసన్, మల్లికార్జుననగర్

రూ.2 కోట్లతో మహాప్రస్థానానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శ్‌నగర్‌లో రూ. 2 కోట్లతో మహాప్రస్థానానికి నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం డివిజన్ పరిధిలో వివిధ సమస్యలను స్వయంగా అధికారులతో కలిసి పరిశీలించి, పెండింగ్ పనులపై ఆరా తీశారు. అనంతరం బ్యాంక్ కాలనీలో రూ.1.40 లక్షలతో నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. నార్త్ కల్యాణపురి పార్కులో రూ.30 లక్షలతో పార్కు అభివృద్ధి చేసినందుకు స్థానికులు మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఎస్సీ నిత్యానందం, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఈఈలు హరిలాల్, నాగేందర్ వివిధ ప్రాంతాలకు చెందిన నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వలేదని బీజేపీ నేతల ఆగ్రహం..

చిలుకానగర్‌లో మహా ప్రస్థానం శంకుస్థాపన పూర్తయిన తర్వాత సమాచారం అందుకున్న చిలుకానగర్ బీజేపీ నేతలు దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో అధికారులను నిలదీశారు. రూ.3 కోట్లు కేటాయించి, రూ.2 కోట్లు మాత్రమేనని శిలాఫలకం వేయడం ఆశ్చర్యానికి గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఈఈ హరిలాల్‌లను నిలదీశారు. దీంతో జెడ్‌సీ హేమంత్ కేశవ్ పాటిల్ మిగిలిన నిధులను ఇతర సౌకర్యాలకు వాడుకుంటామన్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ కమిషనర్ దానకిషోర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి




జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో కార్పొరేటర్లు స్వర్ణరాజ్, బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చర్లపల్లి డివిజన్‌లో నూతన సీసీరోడ్ల ప్రతిపాదనలు, ప్యాచ్‌వర్క్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. ఇంజినీరింగ్ ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ప్రవీణ్, ప్రవీణ్‌గౌడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా: కాప్రా, చర్లపల్లి డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని మంగళవారం కార్పొరేటర్లు స్వర్ణరాజ్, బొంతు శ్రీదేవి కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జలమండలి ఎండీకి సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో కొత్తగా తాగునీటి పైపులైన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలపై త్వరలోనే ప్రణాళికా బద్ధంగా సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని జలమండలి ఎండీ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలో దోమలు, చెత్త నివారణకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం శానిటేషన్, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు గ్రీన్ వేస్టేజ్ కాలనీల్లో ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక కార్యక్రమం చేపడతామన్నారు. అందుకు అవసరమయ్యే నూతన పరికరాలను సమకూర్చుకోవాలని అధికారులకు సూచించామన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువత, మేధావులను భాగస్వాములను చేసి విజయవంతం చేస్తామన్నారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మంజుల, ఎంటమాలజీ ఏఈ వనజ, ఎస్ఎస్. శ్రీనివాస్, శివ, గిరి, బాలామణి, రాంకీ ప్రతినిధులు దయానంద్, జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ 11కేవీ ఐఎస్ఐ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం హబ్సిగూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జేఎస్ఎన్ కాలనీ, సంస్కృతి అపార్ట్‌మెంట్, హవేలి రెసిడెన్సీ, లెజెండ్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి కమిషనర్ త్రిలేశ్వర్‌రావును కలిశారు. ఉత్తమ కమిషనర్‌గా ఎంపికైన సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు. అనంతరం కార్పొరేషన్‌లోని పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. పీర్జాదిగూడ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీసెల్ నేతలు, పార్టీ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

'గద్దర్‌పై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు'

అల్వాల్: ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సీఎల్.యాదగిరి ఓ ప్రకటన ద్వారా ఖండించారు. ఆయన మాట్లాడుతూ.. యావత్ భారతదేశ కళాకారులు, ప్రజాసంఘాలు, కులసంఘాలు, మేధావుల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ, పీడిత పేదలు, అణగారిన వర్గాలు, మహిళల కోసం ఆయన పోరాడారని, తక్కువ చేసి మాట్లాడినంత మాత్రాన గద్దర్ స్థాయి తగ్గదన్నారు. భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే నిరసన చేపడతామని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కుషాయిగూడ: కాప్రా సర్కిల్ కార్యాలయం, డీఏఈ కాలనీ గేటు మెయిన్ రోడ్డు పక్కన ఓ వ్యక్తి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని 108 సిబ్బంది సాయంతో అతడిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు సుమారు 50–55 ఏళ్లు ఉంటాడని పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం



కాప్రా: ఏఐటీయూసీ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా కౌన్సిల్ సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం సంజీవ రెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్మికులకు దక్కాల్సిన ప్రయోజనాల కోసం పోరాటాలు చేయాలన్నారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్‌కార్డు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ నాయకులు కూడా అడ్డా గుర్తింపు కార్డు తయారు చేసి కార్మికులకు ఇవ్వాలని సూచించారు. మార్చిలో జిల్లా మహాసభలు, ఏప్రిల్ 21, 22న రాష్ట్ర మహాసభలు ఉన్నందున వచ్చేనెల ఫిబ్రవరిలో అన్ని అడ్డాల్లో సభలు నిర్వహించి కమిటీలు నియమించాలని కోరారు. ఏఐటీయూసీ నేతలు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, వీరనాగప్ప, స్వామిదాస్, నర్సింగరావు, నగేష్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

అల్వాల్: ఐసీడీఎస్ అల్వాల్ సెక్టార్ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో వెంకటాపురంలోని ఇందిరానగర్ కమ్యూనిటీహాల్‌లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని, చట్టాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతులుగా ఉండాలన్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు, ఫిర్యాదులను విచారించేందుకు ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదు కమిటీ ఉంటుందని, వీటిని గోప్యంగా ఉంచుతామన్నారు. షీ బాక్స్ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ప్రథమ్ ఎన్జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి

రామంతాపూర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ మాధవి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంతమంది విద్యార్థులు నిబంధనలకు విరుద్ధంగా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బైక్‌పై ఇష్టానుసారంగా వెళ్తూ.. ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఎస్సైలు రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



అక్రమ నిర్మాణం కూల్చివేత (ఫైల్)



ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం ఇలా..

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ఇందిరగృహకల్ప కాలనీలో జరుగుతున్న ఆక్రమణలకు అడ్డుకట్టవేయాలని సీసీఎస్ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇందిరగృహకల్ప కాలనీ నిర్మాణ సమయంలో కాలనీకి ఆనుకుని సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఈ సెప్టిక్ ట్యాంకులను వినియోగించకపోవడంతో ఆక్రమణదారులు ఈ స్థలంపై కన్నేసి కబ్జాకు తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఓ మత ప్రచారకుడు సెప్టిక్ ట్యాంకుపై చేపట్టిన కట్టడంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో కాప్రా సర్కిల్ అధికారులు కూల్చివేశారు. తాజాగా ఓ వ్యక్తి రాత్రికి రాత్రే సెప్టిక్ ట్యాంకు ఉన్న స్థలానికి ప్రహరీని నిర్మించి గేటు ఏర్పాటు చేశాడు. దీనిపై అధికారులు స్పందించి ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాలనీకి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని సీసీఎస్ ప్రతినిధి పద్మారెడ్డి విన్నవిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును అమలు చేయాలి



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

హబ్సిగూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హబ్సిగూడలోని కెన్నెరా గ్రాండ్ హోటల్లో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'వేయి గొంతులు లక్ష డప్పులు' కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డాక్టర్ అదామ్, చీమ శ్రీనివాస్, బరిగెల రమేష్, సీహెచ్. రాజమౌళి, ప్రసాద్, కరుణాకర్, రాజు, కృష్ణయ్య, చక్రపాణి పాల్గొన్నారు.